

మైత్రీవనం కాలనీ నుంచి బంధం చెరువుకు వెళ్లే దారిలో మట్టికుప్పలు పోసిన దృశ్యం



కాలనీలో మురుగు నీటి గుంటగా మారిన ఖాళీ ప్లాట్

# రోడ్ల నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- 49వ డివిజన్‌లో శంకుస్థాపనలు చేశారు.. వేయడం మరిచారు..
- రోడ్డు మధ్యలో మట్టికుప్పలు.. వాహనదారులకు తప్పని తిప్పలు

న్యూశాయంపేట, మే 23 : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఉంది 49వ డివిజన్ పరిస్థితి.. విస్తరిస్తున్న మైత్రీవనం, ఇందిరమ్మకాలనీ.. అయినా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటోంది. రోడ్డు కోసం నిధులు మంజూరు చేశారు.. ఇంకా రోడ్లు వేయడం లేదు. 2 సంవత్సరాలుగా కాలనీ నీట మునుగుతోంది. మత్తిడి నుంచి నీళ్లు బయటకు వెళ్లేందుకు దారి సరిగ్గా లేక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కాలనీల్లో రోడ్లు గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. రోడ్డు వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి శంకుస్థాపనలకే పరిమితమైంది. రోడ్డు వేసేందుకు మట్టికుప్పలు పోశారు. నెలల తరబడి అలాగే వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వేసిన సీసీ రోడ్లే కాలనీల్లో దర్శనమిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటికీ గుంతలు పడిన, అధ్వానంగా మారిన రోడ్లకు మోక్షం లభించడం లేదు. నిధులు మంజూరు చేసి మమ అనిపించారు కానీ ఇప్పటివరకు రోడ్లు వేయకపోవడంతో కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా కాలనీ వైపు కన్నెత్తి చూసిన పాపన పోలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఓట్ల కోసం మాత్రం ఎమ్మెల్యే, కార్పొరేటర్ వచ్చి ఓట్లు అడిగారు కానీ ఇప్పటివరకు ఇటు వచ్చిన దాఖలాలు లేవని మండిపడుతున్నారు. సీఎస్ఆర్ నుంచి నిట్ వెనకాల (రైల్వే ట్రాక్ పక్క) నుంచి కాజీపేట దర్గా వరకు వంద ఫీట్ల రోడ్డు వేసేందుకు నిధులు మంజూరైనప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రోడ్డు వేస్తే సిటీలో సైతం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తవని కాలనీవాసులు చెబుతున్నారు. ఇక చినుకు పడితే కాలనీల్లోని రోడ్లు అన్నీ చిత్తడిగా మారుతున్నాయి. గుంతలు పడిన రోడ్డులో నీళ్లు నిలుస్తున్నాయి. వర్షం పడితే కాలనీ మొత్తం నీట మునుగుతోంది. ఇంట్లో నిత్యావసర వస్తువులు తడిసిపోవడంతో దిక్కులేని పరిస్థితిలో కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నారు. తక్షణ చర్యల్లో భాగంగా అధికారులు ఫంక్షన్ హాల్‌కు తీసుకెళ్లి పునరావాసం కల్పిస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూడడం లేదని వాపోతున్నారు.

**గ్రీవెన్స్‌లో విన్నవించినా పట్టించుకోలేదు**

**- నారాయణగిరి శ్రీనాథ్, ఇందిరమ్మ కాలనీ కమిటీ అధ్యక్షుడు**



ఏళ్ల తరబడి కాలనీ అభివృద్ధికి నోచుకోవడం లేదు.. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. సుమారు 200 ఇళ్లు ఉన్నా కాలనీని ఎవరూ పట్టించుకోవడం లేదు. పలుమార్లు కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రాలు కూడా ఇచ్చినా.. ఎమ్మెల్యే కానీ కార్పొరేటర్ ఇటువైపు వచ్చి చూసింది లేదు.. కాలనీలోని మత్తిడి సైడ్ చెత్తాచెదారం పేరుకుపోతున్నాయి. మున్సిపల్ సిబ్బంది తొలగించడం లేదు. వీధి లైట్లు వెలగడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు.

**వాహనదారులకు ఇబ్బందులే..**

**- టీ నర్సింహ, కాలనీవాసి**



రోడ్డు వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి శంకుస్థాపనలకే పరిమితం చేసింది. రోడ్డు వేసేందుకు ప్రస్తుతం ఉన్న రోడ్డు మధ్య మట్టికుప్పలు పోశారు. నెలల తరబడి అలాగే వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. వెంటనే రోడ్డు వేసి కాలనీవాసుల కష్టాలు తీర్చాలి.

## రేపు జేఎన్ఎస్‌లో అథ్లెటిక్స్ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, మే 23 : హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అథ్లెటిక్ మీట్ అండర్-8,10,12 సంవత్సరాల బాయ్స్ అండ్ గర్ల్స్ ఎంపికలు ఈ నెల 25న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి తెలిపారు. 8 సంవత్సరాల వారికి 60, 200 మీటర్ల పరుగుపందెం, స్టాండింగ్ లాంగ్‌జంప్, టెన్నిస్‌బాల్ త్రో, 10 సంవత్సరాల వారికి 60, 300 మీటర్లు, స్టాండింగ్ లాంగ్ జంప్, కిడ్ జావెలిన్ త్రో, 12 సంవత్సరాల వారికి 60, 300 మీటర్లు, స్టాండింగ్ లాంగ్ జంప్, స్టాండింగ్ షాట్‌పుట్, కిడ్ జావెలిన్ త్రో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన వారు జూన్ 1న హైదరాబాద్‌లో జరిగే స్టేట్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గలవారు ఆదివారం జేఎన్ఎస్‌లో హాజరుకావాలని, ఇతర వివరాలకు 93901 04499 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## 29 వరకు పలు రైళ్ల రద్దు

**మరికొన్నింటి దారి మళ్లింపు**

కాజీపేట, మే 23 : మహబూబాబాద్ రైల్వేస్టేషన్లో మూడో రైల్వే లైన్ల నిర్మాణం కారణంగా ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు కాజీపేట - కొండపల్లి మధ్య పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రద్దు అయిన రైళ్లు.. డోర్నకల్ - విజయవాడ మధ్య నడిచే ప్యాసింజర్ అప్ అండ్ డౌన్, విజయవాడ - భద్రాచలం రోడ్డు మధ్య నడిచే ప్యాసింజర్ అప్ అండ్ డౌన్, సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్, సికింద్రాబాద్ -విజయవాడ మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైలును రద్దు చేసినట్లు తెలిపారు. దారి మళ్లించిన రైళ్ల వివరాలు.. షాలిమార్ నుంచి హైదరాబాద్ వరకు నడిచే షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 28, 29 తేదీల్లో విజయవాడ, గుంటూరు, పంగిడిపల్లి, సికింద్రాబాద్ మీదుగా హైదరాబాద్‌కు దారి మళ్లించి నడిపిస్తున్నారు. ముంబై - భువనేశ్వర్ మధ్య నడిచే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 27, 28వ తేదీల్లో పంగిడిపల్లి, నల్లగొండ, గుంటూరు, విజయవాడ మీదుగా నడిపిస్తున్నారు. షిర్డీ - కాకినాడ మధ్య నడిచే షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 27, 28వ తేదీల్లో అమ్ముగూడ, చర్లపల్లి, పంగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా దారి మళ్లించారు. షిర్డీ - మచిలీపట్నం మధ్య నడిచే షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 28న అమ్ముగూడ, చర్లపల్లి, పంగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు.

## 'ఆంగ్ల భాషా బోధనను తొలగించొద్దు'

హనుమకొండ చౌరస్తా, మే 23 : ఆంగ్ల భాషా బోధనను డిగ్రీ మూడో సంవత్సరం నుంచి తొలగించే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు కాకతీయ విశ్వవిద్యాలయ ఆంగ్లవిభాగ పాఠ్యప్రణాళికా అధ్యక్షురాలు నిర్మల తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలోని యూనివర్సిటీ కాలేజీలు, అనుబంధ కళాశాలల ఆంగ్ల విభాగ అధ్యాపకులు, ఆంగ్ల బోధకులతో సమావేశం నిర్వహించారు. విదేశీ యూనివర్సిటీలు ఆంగ్ల భాషలో 20 క్రెడిట్స్ తప్పనిసరి చేశాయని, రాష్ట్రంలో 20 నుంచి 12కు క్రెడిట్స్ తగ్గించటంతో విదేశీ ఉన్నత విద్య అవకాశాలపై చాలా ప్రభావం చూపుతుందన్నారు. విభాగాధిపతి దీపాజ్యోతి, మేఘనారావు, శారద, పాలక మండలి సభ్యులు నవీన్, రాంభాస్కర్‌రాజు, శ్రీనాథ్, సత్యనారాయణ, సత్యం, చందూలాల్, సుజాత, విజయప్రకాశ్ ఉన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కమలాపూర్, మే 23 : మండలంలో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హరికృష్ణ హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం కమలాపూర్‌లో ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయాధికారులతో కలిసి తనిఖీ చేశారు. రైతు డిపో, లక్ష్మీ ఫర్టిలైజర్ షాపుల్లో రికార్డులను పరిశీలించి కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులు అమ్మితే చర్యలు తప్పవన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు రైతుల దృష్టికి వస్తే 100కు కాల్ చేయాలన్నారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏవో రాజ్‌కుమార్, ఏఈవో రహీం, ప్రశాంత్ ఉన్నారు.

## హనుమకొండ చౌరస్తా మోరీ పరిశీలన

హనుమకొండ చౌరస్తా, మే 23 : నగరంలో రెండు రోజులు కురిసిన వర్షాల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయాయని, ప్రజలు ఇబ్బందులు గురికాకుండా మున్సిపల్ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ విభాగాధికారులు ప్రధాన కాల్వలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మేయర్ గుండు సుధారాణి, అధికారులతో కలిసి చౌరస్తా దగ్గర ఉన్న మోరీని ఆయన పరిశీలించారు. రెండురోజులు కురిసిన వర్షం కారణంగా చెత్తతో డ్రెయిన్ నిండిపోవడం గమనించారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. పొంగిపొర్లే ప్రాంతాల్లో అండర్ డ్రైనేజీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.



హనుమకొండ చౌరస్తా మోరీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధారాణి

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- యూపీఎస్సీ, జీపీవో పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు పెంచాలి
- కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, మే 23 : బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమ నిర్వహణకు ప్రణాళిక అవసరమని, తహసీల్దార్, ఎంపీడీవోలు, ఎంఈవోలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జూన్ 6వ తేదీ నుంచి వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలల్లో వెనకబడిన విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో విద్యా బోధన చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఏకరూప దుస్తులు సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ, కేజీబీవీ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ చదివేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పాఠశాలలకు అవసరమైన వసతుల కల్పనపై ఎంపీడీవోల దృష్టికి తీసుకెళ్లి ఎంఎన్ఆర్ ఈజీఎస్ ద్వారా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమాల నిర్వహణపై డీఈవో వాసంతి అధికారులకు వివరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో విద్యాలత, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు. అలాగే ఈ నెల 25వ తేదీన జరగనున్న యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష, గ్రామ పాలన ఆఫీసర్స్(జీపీవో) పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 25వ తేదీన జరిగే యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్, గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్షల నిర్వహణకు పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బంది ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రెండు పూటలా పరీక్షలు నిర్వహణ దృష్ట్యా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష 25వ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్ పరీక్ష, మధ్యాహ్నం 2.30 నుంచి 4:30 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షల నిర్వహణకు 10 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 4,141 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. నిర్ణీత సమయంలో పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. అదేవిధంగా ఈ నెల 25వ తేదీన గ్రామ పాలన ఆఫీసర్స్ టెస్ట్ 2025 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్ష ఉంటుందన్నారు. 132 మంది అభ్యర్థులు ఈ పరీక్షను రాయనున్నట్లు పేర్కొన్నారు. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వైవీ గణేశ్, యూపీఎస్సీ అధికారి కేశ్ రామ్‌మీనా, ఏసీపీ నరసింహారావు, కలెక్టరేట్ పరిపాలనా అధికారి గౌరీ శంకర్ పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి

**పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన**



యాదవనగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మే 23 : రానున్న రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని, ప్రజల సహకారం ఉండాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 4వ డివిజన్ యాదవనగర్, లోటస్ కాలనీ, 9వ డివిజన్ సుధానగర్‌లో రూ.50 లక్షలతో చేపట్టిన అంతర్గత రోడ్లు, సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులకు మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్, రఘు యాదవ్, శ్యాంసుందర్, మూగల విజయ, సురేందర్ పాల్గొన్నారు.

## బురదమయంగా ఆత్మకూరు బస్టాండ్

**బస్సులు ఎక్కేందుకు ప్రయాణికుల ఇబ్బందులు**



బురదమయంగా మారిన బస్టాండ్

ఆత్మకూరు, మే 23 : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ గురువారం కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. బస్టాండ్ ఆవరణలోని గుంతలల్లో వర్షపు నీరు నిల్వడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌ను పరిశీలించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాధనం దుర్వినియోగం

- రూ.3 వేలు ఖర్చు అయ్యే చోట రూ.28,600 అద్దె చెల్లిస్తున్న వైనం
- కార్పొరేషన్ ట్రాక్టర్‌కు రిపేర్ చేయించని ఆఫీసర్లు



బల్దియా ఎదుట ప్రభుత్వ ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయిస్తున్న 13వ డివిజన్ కార్పొరేటర్ సురేశ్ జోషి

వరంగల్, మే 23 : బల్దియా అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. రెండు రోజుల్లో రిపేర్ చేయించాల్సిన వాహనాలను రోజుల తరబడి వెహికల్ షెడ్‌లో ఉంచి చోద్యం చూస్తున్నారు. చెత్త సేకరణ ట్రాక్టర్‌కు మైనర్ రిపేర్ వస్తే దాన్ని పక్కన పెట్టి ప్రైవేట్ ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకొని చెత్త సేకరిస్తున్నారు. 13వ డివిజన్‌లో చెత్త సేకరణ ట్రాక్టర్ రిపేర్ రావడంతో అధికారులు అద్దె ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ట్రాక్టర్‌ను వెహికిల్ షెడ్‌కు తరలించారు. రెండు రోజుల్లో మరమ్మతులు చేస్తామని చెప్పిన అధికారులు పది రోజులైనా రిపేర్ చేయించలేదు. డివిజన్‌లో 13 రోజులుగా ప్రైవేట్ అద్దె ట్రాక్టర్‌తో చెత్త సేకరిస్తున్నారు. అద్దె రోజుకు రూ.2200 అద్దె చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు రూ.28,600 చెల్లించారు. అధికారులు ఏర్పాటు చేసిన అద్దె ట్రాక్టర్ సైతం సరిగ్గా రాకపోవడంతో అసహనానికి గురైన కార్పొరేటర్ సురేశ్ జోషి శుక్రవారం బల్దియా కార్యాలయం ముందే సొంత డబ్బులు రూ.3వేలతో బల్దియా ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించారు. బల్దియా అధికారుల శ్రద్ధ పెడితే రెండు రోజుల్లో ప్రభుత్వ ట్రాక్టర్ రిపేర్ అయ్యేదని, వేల రూపాయల సొమ్ము ప్రైవేట్ ట్రాక్టర్‌కు అద్దె చెల్లించాల్సి వచ్చేది కాదని కార్పొరేటర్ తెలిపారు. పోయేది తమ సొమ్ము కాదు.. బల్దియా సొమ్మే కదా అన్నట్లు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పారిశుధ్య వాహనాల మరమ్మతుల కోసం రోజుల తరబడి వెహికిల్ షెడ్‌లో మూలుగుతున్నాయి. వాహనం టైర్ పంక్చర్ అయినా రోజుల సమయం పడుతుందంటే వాహనాల నిర్వహణ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాల అధికారుల మధ్య సమన్వయ లోపంతో వాహనాలు రోజుల తరబడి వెహికిల్ షెడ్‌లో పడి ఉంటున్నాయి. మేయర్, కమిషనర్ వెహికిల్ షెడ్‌లను నామమాత్రంగా తనిఖీలు చేసి రావడం తప్పా అక్కడ అసలు జరుగుతున్న పనితీరుపై శ్రద్ధ పెట్టిన దాఖలాలు లేవు. పారిశుధ్య వాహనాలకు జీపీఎస్ విధానం సరిగా అమలు చేయకపోవడంతో ఏ వాహనం ఎక్కడ తిరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. బల్దియా పారిశుధ్య వాహనాల నిర్వహణ అధ్వానంగా మారింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED FEMALE TELECALLERS

jobs Apply Now!

★Urgent Requirement for Female Tele-Callers in Corporate DSA Office Salary+Incentives etc., Job Location: Hanamkonda. Cont: +91 8886426539.

NTW-7713

CHANGE OF NAME

I, NAMPALLI RAJ KUMAR (New Name) R/o H.No. 1-2-128, RahamathNagar, Kazipet, Hanumakonda District-506003, Telangana State, Have Changed my name from NAMPELLY RAJKUMAR (Old Name), To NAMPALLI RAJ KUMAR (New Name) and Solemnly Declare.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను విస్తరించాలి

**ఎంపీ కడియం కావ్య**



రక్తనిధి కేంద్రానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య

పరకాల, మే 23 : రెడ్‌క్రాస్ సేవలను పల్లె పల్లెకూ విస్తరించాలని ఎంపీ కడియం కావ్య అన్నారు. పట్టణంలో రూ.1.5కోట్లతో నిర్మించనున్న రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ భవనానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిపూర్ణ సామాజిక మార్పు కోసం యువతను స్ఫూర్తిదాయక మార్గంలో నడిపించాలన్నారు. మత్తుపదార్థాల వాడకాన్ని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. రక్తాన్ని సేకరించి భద్రపరచడమే కాకుండా, ప్రమాదాల సమయంలో, ప్రసవాల్లో, తలసీమియా బాధితులకు ప్రాణరక్షక సాధనంగా నిలుస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ విజయచందర్‌రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, బొమ్మినేని పాపిరెడ్డి (ట్రెజరర్), సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, మాగంటి శేషుమాధవ్, సంధ్యారాణి, బిళ్ల రమణారెడ్డి హాజరయ్యారు.

## మహిళా సంఘాలకు మొక్కల పర్యవేక్షణ బాధ్యతలు

మడికొండ, మే 23 : మొక్కలు నాటి పర్యవేక్షించే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించనున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ మిత్ర 2.0లో భాగంగా నగరంలోని మూడు చెరువుల్లో మొక్కలు నాటి సంరక్షించేలా ఎంపిక చేసిన నేపథ్యంలో వుమెన్ ఫర్ ట్రీస్‌లో భాగంగా శుక్రవారం భట్టుపల్లిలోని కోట చెరువును మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి వారు పరిశీలించారు. హెచ్‌వోలు రమేశ్, లక్ష్మీరెడ్డి, టీఎంసీ రమేశ్ పాల్గొన్నారు.

## క్రీడాకారిణి నాగలక్ష్మికి సన్మానం

హసన్‌పర్తి, మే 23 : నెల్లూరులోని విక్రమ్ సింహపురి యూనివర్సిటీలో నిర్వహించిన ఆల్ ఇండియా యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టు పాల్గొంది. అందులో గ్రేటర్ 65 డివిజన్ దేవన్నపేటకు చెందిన పోలెపల్లి నాగలక్ష్మి పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచింది. దీంతో గ్రామస్తులు క్రీడాకారిణి నాగలక్ష్మి, కోచ్ పంజాల జగదీశ్‌ను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో పోలెపల్లి రాజు, భూపాల్‌గౌడ్, సాంబారెడ్డి, రాజు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## సీపీఐ మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

హసన్‌పర్తి, మే 8 : మండల కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించే సీపీఐ రెండో మహా సభను విజయవంత చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. గ్రేటర్ రెండో డివిజన్ వంగపహాడ్‌లో సీపీఐ గ్రామాధ్యక్షుడు దోమ రాకేశ్ అధ్యర్యంలో శుక్రవారం మహాసభను వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మండలాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి, నాయకులు నేదునూరి రాజమౌళి, జ్యోతి, దాసు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికలో శివుడి విగ్రహావిష్కరణ

మడికొండ, మే 23 : మడికొండ హిందూ శ్మశాన వాటికలో పెట్టెం సాంబయ్య కుటుంబ సభ్యులు కట్టమ్మ, మల్లయ్య, కమలమ్మ, కోటయ్య, లక్కర్స్ జ్ఞాపకార్థం నూతనంగా శివుడి విగ్రహం ఏర్పాటు చేయగా 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన హాజరై ఆవిష్కరించారు. మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, నాయకులు వస్కుల శంకర్, వినోద్ కుమార్, భిక్షపతి, నాగరాజు, మెట్టుగుట్ట ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అల్లం శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

## ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్ష కేంద్రం పరిశీలన

హనుమకొండ చౌరస్తా, మే 23 : కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రం క్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ పరీక్ష కేంద్రంలో జరుగుతున్న ఎంబీఏ (నాలుగో సెమిస్టర్) పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ప్రిన్సిపాల్ అమరావేణి, ప్రగతి ఉన్నారు.

## చెట్టును ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

ధర్మసాగర్, మే 23 : చెట్టును బైక్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మల్లక్‌పల్లె గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన నాయిని లోహిత్ కుమార్ (24) పదిహేను రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వివాహ సర్టిఫికెట్ తెచ్చుకునేందుకు లోహిత్ కుమార్ తన స్నేహితుడు వస్కుల ప్రదీప్‌తో కలిసి ద్విచక్రవాహనంపై చిల్పూర్ దేవస్థానానికి వెళ్లి తిరిగి ఇంటి వస్తున్న క్రమంలో మల్లక్‌పల్లె గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నారు. లోహిత్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా ప్రదీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం 108లో దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి

పరకాల, మే 23 : ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వ నిబంధనల మేరకే నిర్మించుకోవాలని హౌసింగ్ పీడీ రవీందర్ పేర్కొన్నారు. పట్టణంలో ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణంలో ఎక్కువ ఖర్చు కాకుండా కట్టడి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఇళ్లను హౌసింగ్ డైరెక్టర్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తనిఖీ చేసి ఎలాంటి అవకతవకలు జరిగినా అధికారులపై చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. పరకాల లేబర్ అధికారి వినోద్‌కుమార్, హౌసింగ్ ఏఈ ఆకాంక్ష పాల్గొన్నారు.

## రైతులు పచ్చిరొట్ట సాగు చేసుకోవాలి

పరకాల, మే 23 : రైతులు ప్రధాన పంటలకు ముందు పంట పొలాల్లో పచ్చిరొట్టను సాగు చేసుకోవాలని శాస్త్రవేత్త రాములు సూచించారు. పట్టణంలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారుల సూచనల మేరకే ఎరువులు, రసాయనాలు వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కువ వినియోగిస్తే పెట్టుబడి వ్యయం పెరగడంతో నష్టాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, శాస్త్రవేత్త ప్రశాంత్, రైతు ప్రతినిధి యాదగిరి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణాధికారి శైలజ, వ్యవసాయ విద్యార్థులు లక్ష్మీ భవానీ, ఇందు, రిషి పాల్గొన్నారు.

**పంట మార్పిడి చేయాలి..**

నడికూడ : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం శాస్త్రవేత్తలు మధు, హరి, మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఏటా పంట మార్పిడి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రామకృష్ణ, జోరు ప్రశాంత్ పాల్గొన్నారు.

## బాల సదనం నుంచి అమెరికాకు దత్తత

హనుమకొండ, మే 23 : చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ శుక్రవారం కలెక్టర్ పీ ప్రావిణ్య ఆధ్వర్యంలో జరిగింది. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, అనుబంధ శిశు గృహ, బాల సదనంలో ఆశ్రయం పొందుతున్న బాలిక (10) వివరాలను కేంద్ర దత్తత వనరుల విభాగానికి ఆన్‌లైన్ ద్వారా పంపగా, అమెరికాకు చెందిన దంపతులు అంతర్‌రాష్ట్ర దత్తత కోసం దరఖాస్తు చేసుకొన్నారు. దరఖాస్తును పరిశీలించిన కేంద్ర దత్తత వనరుల విభాగం సీనియార్టీ ప్రకారం గతంలో శిశు గృహ, బాలసదనంలో రక్షణ, సంరక్షణ నిబంధనల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్‌కంట్రీ అడాప్షన్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాతృత్వం ఒక వరమని, అందుకు చట్టబద్ధమైన దత్తత ప్రధాన మార్గమని, పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తతను తీసుకోవాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు10మంది పిల్లలను ఇంటర్ కంట్రీ అడాప్షన్‌లో భాగంగా ఇటలీ, మాల్టా, లండన్, అమెరికా దేశాలకు దత్తత ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సందసాని రాజేంద్రప్రసాద్, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ సీహెచ్ అవంతి, బాలసదనం సూపరింటెండెంట్ కల్యాణి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జి అధికారి ప్రవీణ్‌కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మౌనిక, దత్తత కేంద్రం సోషల్ వర్కర్ సంగి చైతన్య పాల్గొన్నారు.



దత్తత ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఐసీడీఎస్ అధికారులు